

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 11-03-2025 | సంపుటి - 21 | సంచిక - 319 | రూ : 4 | పేజీలు: 8




## ఆహారమే మెడిసిన్..
# వంటగదే ఫార్మసీ

- రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని విస్తరిస్తాం
- ప్రభుత్వ సలహాదారుగా నోరి దత్తాత్రేయుడు నియామకం
- మంటాడ టు మ్యాన్‌హ్యాటన్ పుస్తకావిష్కరణ సభలో సీఎం

అమరావతి: మనం తీసుకునే ఆహారమే ఔషధం..వంటగదే పార్మసీ..రోగాలు రాకుండా చూసుకోవాల్సి బాధ్యత మనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. విజయవాడలో సోమవారం ప్రముఖ క్యాన్సర్ వైద్యులు నోరి దత్తాత్రేయుడు రచించిన 'మంటాడ టూ మ్యాన్‌హ్యాటన్' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. 'క్యాన్సర్ వస్తే డాక్టర్ వైద్యం చేస్తారు. రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది. రానున్న నాలుగేళ్లల్లో 50 లక్షల ఎకరాలకు ప్రకృతి సేద్యాన్ని విస్తరిస్తాం. దీనికి చిరునామాగా ఏపీని మార్చుతామ'ని తెలిపారు. ''మా అత్తగారు బసవతారకానికి క్యాన్సర్ వచ్చినప్పుడు కుటుంబమంతా బాధపడ్డాం. అప్పట్లో దేశవ్యాప్తంగా

తరువాయి 2లో

## ఇళ్లు రాలేదన్న
# ఫిర్యాదులను పరిశీలించాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు రాలేదన్న ఫిర్యాదులు వస్తే వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని, అనర్హులకు ఇళ్లు కేటాయించారన్న మాట ప్రభుత్వానికి రాకూడదని అధికారులకు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం తన ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ''జనవరి మూడో వారంలో నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలి. ఇప్పటి వరకు 562 గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికలో ఎదురైన లోటుపాట్లను బేరీజు వేస్తూ అర్హులను గుర్తించాలి. లబ్ధిదారుడు అనర్హుడని తేలితే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నా వాటిని రద్దు చేస్తాం.

తరువాయి 2లో









# జాతీయ విద్యా విధానంపై రగడ

- తమిళనాడు రాజకీయంగా పిల్లిమొగ్గ వేస్తోందన్న కేంద్రమంత్రి
- ప్రధాన్ వ్యాఖ్యలపై లోక్‌సభలో డీఎంకే అభ్యంతరం
- తమ రాష్ట్రంలో త్రిభాషా సూత్రం చెల్లదని స్పష్టీకరణ
- మంత్రి నోటిని అదుపులో పెట్టుకోవాలన్న స్టాలిన్

దిల్లీ, చెన్నై: దక్షిణాదిపై హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు ఇప్పుడు పార్లమెంటును తాకాయి. జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీని) అమలు చేయడానికి తమిళనాడు ప్రభుత్వం నిరాకరిస్తోందని, పిల్లిమొగ్గలు వేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మండిపడ్డారు. విద్యపై రాజకీయం చేస్తూ విద్యార్థుల భవితతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. దీనిపై డీఎంకే ఎంపీలు తీవ్ర

తరువాయి 2లో




## కెనడా ప్రధానిగా
# మార్క్ కార్నీ

- ట్రూడో వారసుడిగా ఎన్నికైన మాజీ బ్యాంకర్

టొరంటో: కెనడా తదుపరి ప్రధానిగా మాజీ బ్యాంకర్ మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. ఆదివారం ఒట్టావాలో జరిగిన అధికార లిబరల్ పార్టీ సమావేశంలో ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో వారసుడిగా ఆయనను ఎన్నుకున్నారు. పార్టీ

తరువాయి 2లో

## పారిశ్రామిక రాయితీల్లోనూ
# లంచాలు అడిగారు

- నాటి వైకాపా పాలకులపై మంత్రి లోకేశ్ ధ్వజం
- పారిశ్రామికవేత్తలను ఒప్పించి రాష్ట్రానికి తీసుకొస్తున్నామని వెల్లడి

2లో



## నేడు గ్రూప్-2
# మార్కుల వెల్లడి

- జనరల్ ర్యాంకు జాబితా కూడా..

హైదరాబాద్: రాష్ట్రంలో 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబరు 15, 16 తేదీల్లో నిర్వహించిన రాతపరీక్షల మార్కులను టీజీపీఎస్సీ మంగళవారం వెల్లడించనుంది. అభ్యర్థులకు మార్కులతో కూడిన జనరల్ ర్యాంకు జాబితాను ప్రకటించనుంది. ఈ మేరకు ఇప్పటికే టీజీపీఎస్సీ షెడ్యూలు ప్రకటించింది.



## శ్రీకాకుళం జిల్లాలో
# ఫిషింగ్ హార్బర్, జెట్టీలు ఏర్పాటుచేయండి

- కేంద్రమంత్రి సర్బానంద్ సోనోవాల్‌కు రామ్మోహన్‌నాయుడి లేఖ

దిల్లీ: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం భావనపాడులో ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, గార మండలం కళింగపట్నంలలో ఫిషింగ్ జెట్టీలు నిర్మించాలని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సోమవారం కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌ను కోరారు. ఈ మేరకు ఆయన లేఖరాశారు. ''194 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో

తరువాయి 2లో

## సిరియా వీధుల్లో
# శవాల గుట్టలు

- 48 గంటల్లో 745 ప్రతీకార హత్యలు
- అలావైట్లను ఊచకోత కోసిన భద్రతా దళాలు
- సైనిక చర్య ముగిసినట్లు ప్రకటించిన ప్రభుత్వం

డమాస్కస్: సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్‌అసద్ మద్దతుదారులపై తాము చేపట్టిన సైనిక చర్య ముగిసినట్లు సిరియా ప్రభుత్వం ప్రకటించింది. గత నాలుగు రోజులుగా జరుగుతున్న

తరువాయి 2లో



# ఆహారమే మెడిసిన్.. వంటగదే ఫార్మసీ

(మొదటిపేజీ తరువాయి)

ముంబయి, అడయార్‌లో మాత్రమే క్యాన్సర్ ఆస్పత్రులుండేవి. అమెరికాలో నోరి దత్తాత్రేయుడు చికిత్స అందించారు. 'ఎన్టీఆర్ భార్యగా డబ్బులు పెట్టుకొని అమెరికా రాగాలిగాను. ఎంతమందికి ఈ అవకాశం ఉంటుంది? ప్రజలకు అవసరమైన క్యాన్సర్ ఆస్పత్రి పెట్టాల'ని బసవతారకం గారు చెప్పారు. ఎన్టీఆర్.. దత్తాత్రేయుడితో మాట్లాడి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఏడెకరాలు కేటాయించారు. నేను సీఎం అయ్యాక ఆస్పత్రిని పూర్తిచేశాం'' అని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.



### పదవి కాదు.. బాధ్యత

'ప్రభుత్వ సలహాదారుగా నోరి దత్తాత్రేయుడిని తీసుకుంటున్నాం. ఇది ఆయనకు పదవి కాదు, బాధ్యత. వేల మంది క్యాన్సర్ బారిన పడకుండా నివారించే అవకాశం ఉంటుంది. మారుమూల గ్రామమైన మంటాడలో పుట్టి, ప్రపంచానికి సేవలందించిన దత్తాత్రేయుడు తెలుగువారు కావడం మనకు గర్వకారణం. ఆయన పట్టుదలతో కష్టపడి ఎదిగారు. సంకల్ప బలం ఉండి, చిన్న పరిచయంతో అమెరికా వైద్యుడిని మెప్పించారు. అమెరికా వెళ్లి అంచెలంచెలుగా ఎదిగారు. 50 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్నారు. జన్మభూమిని చూసి పులకించి, ఆయన రాసిన గ్రంథాన్ని ఇక్కడే విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు' అని వెల్లడించారు.

### * అమరావతిలో క్యాన్సర్ ఆస్పత్రి

'అమరావతిలోనూ క్యాన్సర్ ఆస్పత్రి పెడతాం. ఇప్పటికే భూములు కేటాయించాం. క్యాన్సర్ వచ్చిందనగానే భయం గుప్పిట చిక్కుకుపోతున్నారు. ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతుంది. క్యాన్సర్ రోగుల సంఖ్యాపరంగా భారత్ మూడో స్థానంలో ఉంది. ఏటా 13 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతుంటే 9 లక్షల మంది చనిపోతున్నారు. ఏపీలో 70 వేల కేసులు వస్తుంటే, 40 వేల మంది చనిపోతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 1.49 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తే, 56,851 మందిని అనుమానితులుగా గుర్తించారు. 2 కోట్ల మందికి బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 77.53 లక్షల మందిని పరీక్షించాం. వీరిలో 33 వేల మంది అనుమానితులుగా ఉన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే, బయటపడొచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు. అంతకుముందు వైద్యులు నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదిగిన క్రమాన్ని, తండ్రి చనిపోయాక తనను చదివించేందుకు తల్లిపడిన కష్టాన్ని గుర్తు చేసుకున్నారు. తనకు తల్లే గురువు, ఆదర్శమని తెలిపారు. ఎన్ని అవార్డులు వచ్చినా, రోగులు ప్రశంసిస్తే అదే తనకు ఆనందమని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, గద్దె రామోహ్మన్, కొణతాల రామకృష్ణ, ఎంఎస్ రాజు, ఎమెస్కో విజయకుమార్ పాల్గొన్నారు.

# పారిశ్రామిక రాయితీల్లోనూ లంచాలు

అమరావతి: వైకాపా హయాంలో పాలకులు.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టినవారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలోనూ 50 శాతం లంచం అడిగేవారని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ఇటీవల దిల్లీలో తనను కలిసిన ఒక పారిశ్రామికవేత్త ఈ విషయం చెప్పారని తెలిపారు. ఏపీలో ఇక అలాంటి పరిస్థితులు ఉండవని వారికి హామీ ఇస్తున్నామన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన అశోక్ లేల్యాండ్ యూనిట్‌ను ఈ నెల 19న ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 'పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించి రాష్ట్రానికి తీసుకొస్తున్నాం. ప్రతిదీ మాకు చెప్పాలి, ప్రతివాళ్లూ వచ్చి మమ్మల్ని కలవాలని పట్టుబట్టడం లేదు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తు న్నాం. రాష్ట్రానికి ప్రీమియర్ ఎనర్జీ ప్రాజెక్టు అలాగే వచ్చింది. ఏపీఈడీబీ సీఈవో వారితో సంప్రదింపులన్నీ పూర్తి చేసి, అంగీకారం తెలిపాకే మాకు చెప్పారు' అని లోకేశ్ వెల్లడించారు. సోమవారం ఆయన శాసనసభ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను చాలా వరకు పరిష్కరించామని తెలిపారు. అంగన్‌వాడీల డిమాండ్ల గురించి ప్రస్తావించగా వాటిలో నాలుగు ఇప్పటికే ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా దృష్టిలో ఉంచుకుని మిగతా డిమాండ్లపై ప్రభుత్వం దృష్టి పెడుతుందన్నారు.

### * రివర్స్ టెండరింగ్ లేకుండానే రూ.వెయ్యి కోట్లు ఆదా

పాఠశాల విద్యార్థులకు ఇచ్చే గుడ్లు, చిక్కీ, స్కూల్ కిట్‌లో రివర్స్ టెండరింగ్ లేకుండానే రూ.వెయ్యి కోట్లు ఆదా చేశా మన్నారు. దీన్ని బట్టి జగన్ ప్రభుత్వం దీనిలో ఎంత అవినీతికి పాల్పడిందో అర్థమవుతోందని పేర్కొన్నారు. యూని ఫాంల నాణ్యత కూడా పెంచుతున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా జల్లెడపట్టి యూనివర్సిటీలకు వీసీలను నియ మిస్తే, కేంద్ర ప్రభుత్వం కూడా వారినే కావాలంటోందని ఆయన వ్యాఖ్యానించారు. యోగివేమన యూనివర్సిటీ వీసీగా నియమించిన ప్రకాశ్‌బాబును కేంద్ర ప్రభుత్వం పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వీసీగా ఎంపిక చేయడాన్ని ఆయన ప్రస్తావించారు.

### * మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు రాజకీయ శిక్షణ

శాసనసభకు మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు రాజకీయపరమైన అం శాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలేంటి, ప్రజల్ని, పార్టీ క్యాడర్‌ని ఎలా సమన్వయం చేసుకోవా లన్న విషయంలో వారు కొంత ఇబ్బంది పడుతున్నారని, అందుకే శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిపారు. పార్టీ విధానాల్ని అర్థం చేసుకుని పని చేయడంలో.. కొన్నిసార్లు సీనియర్ ఎమ్మెల్యేలతోనే ఇబ్బంది వస్తోందని, తొలిసారి ఎన్నికైనవారికి ఒకసారి చెబితే లైన్ దాటకుండా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

### * బలహీనవర్గాలపై తెదేపా చిత్తశుద్ధికి నిదర్శనం

మూడు ఎమ్మెల్సీ స్థానాల్నీ బల హీనవర్గాలకే కేటాయించడం ద్వారా బీసీల అభ్యున్నతిపై తన చిత్తశుద్ధిని తెదేపా మరోసారి చాటుకుందని లోకేశ్ పేర్కొన్నారు. శాసనమండలిలో సమర్థంగా వాణి వినిపించగల యువ మహిళా నేతల్ని ప్రోత్సహించేందుకే కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారని తెలిపారు. తెదేపా ప్రతిపక్షంలో ఉండగా బీటీ నాయుడు, బీద రవిచంద్ర చూపించిన విధేయత అందరికీ తెలిసిందేనన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడ్డ ప్రతి ఒక్కరికీ దశలవారీగా పదవులు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు.

# జాతీయ విద్యా విధానంపై రగడ

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరం తెలిపారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల మలివిడత సోమవారం మొదలైంది. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌ఈపీని వ్యతిరేకిస్తున్న తమిళనాడు అధికార పార్టీ డీఎంకే ఎంపీలు దానిపై కొన్ని ప్రశ్నలు సంధించారు. పీఎంశ్రీ పథకం కింద కేంద్రం తమ రాష్ట్రానికి నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. విద్యా విధానంతో ఈ నిధు లకు ముడిపెట్టడమేమిటన్నారు. కేంద్రానికి అలాంటి హక్కులేదని స్పష్టంచేశారు. అటు తమిళనాడులోనూ ఇవి వేడి పుట్టించాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చెన్నైలో దీనిపై ధ్వజమెత్తారు.

### * ముందు అంగీకరించి తర్వాత వెనక్కి

ఎన్‌ఈపీ బాగుందని గతంలో తనకు చెప్పిన డీఎంకే ఎంపీలు తమ ముఖ్యమంత్రితో మాట్లాడిన తర్వాత మనసు మార్చుకున్నారని, అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి ఆ రాష్ట్రం ఒకదశలో అంగీకరించి.. తర్వాత వెనక్కి వెళ్లిందని మంత్రి ప్రధాన్ చెప్పారు. ఎన్‌ఈపీ అమలుపై సంతకం చేస్తే కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని పాఠశాలల బలోపేతానికి పీఎంశ్రీ కింద నిధులు ఇస్తామని చెప్పారు. సంతకం చేయడానికి ఇంకో 20 రోజుల సమయమే మిగిలి ఉందన్నారు. తన వ్యాఖ్యల్ని వ్యతిరేకిస్తూ నినాదాలతో సభాపతి స్థానం వద్దకు చేరి బైఠాయించినవారిపై కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్‌ఈపీపై ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇదంతా సభలో రగడకి దారితీసింది. త్రిభాషా సూత్రం తమ రాష్ట్రానికి ఆమోదయోగ్యం కాదని, ఎన్‌ఈపీని సంపూర్ణంగా అమలు చేయడానికి అంగీకరించేదే లేదని డీఎంకే సభ్యులు తేల్చిచెప్పారు. పార్లమెంటరీ పద్ధతుల్ని ఉల్లంఘించవద్దని స్పీకర్ ఓం బిర్లా వారించారు. అయినా సభ్యులు తగ్గలేదు. కాంగ్రెస్ సహా మరికొన్ని విపక్షాల సభ్యులూ వారికి మద్దతుగా నిలిచారు. తమిళనాడు ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మంత్రి మాట్లాడారని వారు అభ్యంతరం తెలిపారు.

### * ఈ చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం

''విద్యార్థుల భవిష్యత్తుతో డీఎంకే చెలగాటమాడుతోంది. వారంతా నిజాయతీ లేనివారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు డీఎంకే సిద్ధంగా లేదు. భాషపరమైన వివాదాలు సృష్టించడమే వారు పనిగా పెట్టుకున్నట్లున్నారు.. రాజకీయాలు చేస్తున్నారు. ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. వారి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం'' అని ప్రధాన్ ఆరోపించారు. భాజపాయేతర రాష్ట్రాలతో తమకెలాంటి వివాదాలు లేవని చెప్పారు. తాను వాడిన ఒక పదంపై డీఎంకే ఎంపీ కనిమొళి అభ్యంతరం వ్యక్తం చేయడంతో మంత్రి దానిని ఉపసంహరించుకున్నారు. స్పీకర్ దానిని రికార్డుల నుంచి తొలగించారు. వాగ్వాదాల నడుమ స్పీకర్ ఓంబిర్లా సభను కొంతసేపు వాయిదా వేశారు. తర్వాత తిరిగి సమావేశమైనప్పుడూ నిరసనలు ఏమాత్రం తగ్గలేదు. తమిళనాడులో డీఎంకే శ్రేణులు పలుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి.

### రాజ్యసభలో విపక్షం వాకౌట్

నకిలీ ఓటరు కార్డులు, ఓటింగ్ శాతం పెంచడానికి అమెరికా నిధులు వంటి అంశాలపై చర్చకు తామిచ్చిన 12 వాయిదా తీర్మాన నోటీసులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తిరస్కరించడంతో రాజ్యసభలో విపక్షాలు నిరసన తెలిపి, తర్వాత వాకౌట్ చేశాయి. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధమేనని రాజ్యసభాపక్ష నేత జె.పి.నడ్డా స్పష్టంచేశారు. వాకౌట్ చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా విపక్ష ఎంపీలంతా సభా నిబంధనలపై పునశ్చరణ తరగతులకు వెళ్లాలని సూచించారు. చర్చపై వారికి ఆసక్తి లేదని, ప్రభుత్వమే చర్చను తప్పించుకోవాలనుకుంటోందన్న అభిప్రాయాన్ని కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

### మా ఎంపీలను అనాగరికులు అంటారా?

చెన్నై: కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నాలుకను అదుపులో పెట్టుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించారు. ప్రధాన్ తనను తాను ఓ రాజుగా భావించుకుని అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. పీఎంశ్రీ అమలులో ఎవరూ తనపై ఒత్తిడి తీసుకురాలేరన్నారు. తమ నుంచి వసూలుచేసిన నిధులను ఇస్తారో లేదో చెప్పాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడుకు నిధులు మంజూరు చేయకుండా మోసగించే ఆయన తమిళనాడు ఎంపీలను అనాగరికులు అని అంటారా అని అభ్యంతరం తెలిపారు. తమిళనాడును, ప్రజలను అవమానించడాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆమోదిస్తున్నారా అని ప్రశ్నించారు. తాము ప్రజల మనోభావాలను గౌరవించి వ్యవహరిస్తున్నామని, ప్రధానిలా ఆరెస్సెస్ భావజాలానికి కట్టుబడి మాత్రం కాదన్నారు. తమిళనాడు విద్యార్థుల నిధులను, తమ నుంచి వసూలు చేసిన పన్నులను మంజూరు చేయడం సాధ్యమా, కాదా అనేది సమాధానంగా చెప్పాలని కోరారు.

# ఇళ్లు రాలేదన్న ఫిర్యాదులను పరిశీలించాలి

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధిదారుల ఎంపికలో వీలైనంత వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి'' అని అధికారులకు పొంగులేటి సూచించారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ పాల్గొన్నారు.

# కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ

(మొదటిపేజీ తరువాయి)

సభ్యుల్లో ఆయనకు 85.9శాతం మంది మద్దతు లభించింది. 59 ఏళ్ల కార్నీ అతి త్వరలో కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. భారత్‌తో సంబంధాలను పునరుద్ధరిస్తానని, అమెరికాతో వాణిజ్య యుద్ధంలో గెలుస్తామని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### ఎవరీ కార్నీ..

కెనడా సెంట్రల్ బ్యాంక్ అధిపతిగా పని చేసిన ప్రముఖ ఆర్థిక వేత్త అయిన కార్నీ.. దేశ వాయవ్య ప్రాంతంలోని ఫోర్ట్ స్మిత్‌లో 1965 మార్చి 16న జన్మించారు. ఆ తరువాత ఆల్బర్టాలోని ఎడ్మంటన్‌లో పెరిగారు.

* 1988లో హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్నారు. ఆక్స్‌ఫర్డ్‌లో మాస్టర్స్‌తోపాటు పీహెచ్‌డీ చేశారు. చాలా మంది కెనడియన్ల లాగే కార్నీ ఐస్ హాకీ ఆడేవారు.
* తొలుత గోల్డ్‌మన్ శాక్స్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరిన ఆయన లండన్, టోక్యో, న్యూయార్క్, టొరంటోలలో 13 ఏళ్లపాటు పని చేశారు.
* 2003లో కెనడా సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2008 నుంచి 2013 వరకూ ఆ బ్యాంక్ గవర్నర్‌గా సేవలందించారు. ఆ సమయంలో 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని బయటపడేశారు.
* 2013 నుంచి 2020 వరకూ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ అధిపతిగా సేవలందించారు. 1694లో స్థాపించిన ఈ బ్యాంక్‌కు తొలి బ్రిటిషేతర గవర్నర్‌గా పని చేశారు.
* 2020 నుంచి ఐక్యరాజ్య సమితి వాతావరణ కార్యాచరణ, ఆర్థిక విభాగాధిపతిగా పని చేశారు.

### 3 దేశాల పౌరసత్వం

* కార్నీకి కెనడా, బ్రిటన్, ఐర్లాండ్ పౌరసత్వాలున్నాయి. ఆ తరువాత ఆయన రాజకీయ ఆకాంక్షల నేపథ్యంలో కెనడా పౌరసత్వాన్ని ఉంచుకుని మిగిలిన రెండింటిని వదులుకున్నారు.
* కార్నీ భార్య డయానా బ్రిటన్‌లో జన్మించారు. వారికి నలుగురు కుమార్తెలు ఉన్నారు.

### భారత్‌తో సంబంధాల పునర్నిర్మాణం

కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపడితే భారత్‌తో సంబంధాలను పునర్నిర్మిస్తానని మార్క్ కార్నీ తెలిపారు. సానుకూల దేశాలతో వాణిజ్య బంధాన్ని విస్తృతం చేయడానికి సిద్ధమేనని ప్రకటించారు. ఆదివారం కెనడా ప్రధానిగా ఎన్నికైన ఆయన అంతకు ముందు మంగళవారం ఈ విషయాన్ని ప్రకటించారు. దీంతో ట్రూడో హయాంలో దెబ్బతిన్న భారత్, కెనడా సంబంధాలు మళ్లీ పట్టాలెక్కే అవకాశముందని భావిస్తున్నారు. 'భారత్‌తో సంబంధాలను పునర్నిర్మించడానికి ఎన్నో అవకాశాలున్నాయి. వాణిజ్య బంధంలో విలువలను పంచుకోవాల్సి ఉంది. నేను ప్రధానిగా ఎన్నికైతే భారత్‌తో బంధాన్ని పునరుద్ధరించుకునే అవకాశాన్ని వినియోగించుకుంటా' అని కార్నీ పేర్కొన్నారు.

# సిరియా వీధుల్లో శవాల గుట్టలు

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేషన్‌లో 1130 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇందులో అత్యధికం అసద్ తెగకు చెందిన అలావైట్లే. గతేడాది డిసెంబరులో అసద్‌ను గద్దె దింపి తిరుగుబాటుదారులు అధికార పగ్గాలు చేపట్టిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ప్రశాంతంగా ఉన్న సిరియా.. గురువారం జాబ్లే నగరంలో 13 మంది భద్రతా సిబ్బందిని అసద్ మద్దతుదారులు హతమార్చడంతో అట్టుడికింది. అలావైట్ల తిరుగుబాటును అణచివేసేందుకు భారీగా ప్రభుత్వ దళాలు రంగంలోకి దిగాయి. ప్రతీకారదాడులు చేపట్టాయి. చాలా ప్రాంతాల్లో వీధుల్లో శవాలు పడి ఉన్నాయని.. మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసుకొన్నాయి. అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుడు వెల్లడించాడు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించాడు. ''మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో.. మేము లైట్లు ఆర్పేసి.. దాక్కొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు'' అని కమెల్ వెల్లడించాడు. తాజాగా చెలరేగిన హింసపై దర్యాప్తు చేస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అసద్ వర్గానికి చెందినవారు, విదేశీ శక్తుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. ప్రస్తుతం తాము సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నామన్నారు.

# శ్రీకాకుళం జిల్లాలో ఫిషింగ్ హార్బర్, జెట్టీలు ఏర్పాటుచేయండి

(మొదటిపేజీ తరువాయి)

230కిపైగా మత్స్యకార గ్రామాలున్నాయి. వీరికి స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంవల్ల దూరప్రాంతాలకు వలసవెళ్తున్నారు. ముఖ్యంగా గుజరాత్, కర్ణాటక, కేరళకు ఈ వలసలు అధికంగా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో ఈ మూడుచోట్ల ఫిషింగ్‌హార్బర్, జెట్టీలు నిర్మించాల్సిన అత్యవసర పరిస్థితి ఉంది. దీనివల్ల స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది'' అని రామ్మోహన్‌నాయుడు వివరించారు.

# 'దేవాదుల' కింద సాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

### * ఉమ్మడి వరంగల్ జిల్లా సాగునీటి సరఫరాపై మంత్రులు పొంగులేటి, ఉత్తమ్

హైదరాబాద్: దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దని ఉమ్మడి వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో వారు సమీక్ష నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. దేవాదుల నిర్వహణకు సంబంధించిన ఓ అండ్ ఎం బిల్లులు పెండింగ్ పెట్టిన కారణంగా నీటి ఎత్తిపోతలు ఇటీవల నిలిచిపోయిన తీరుపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రూ.5 కోట్లకు పైగా బిల్లులు బకాయి పడినట్లు ఇంజినీర్లు తెలిపారు. పైపుల్లో సమస్య ఏర్పడి జనగామ వరకు నీళ్లు రావడం లేదని ప్రజాప్రతినిధులు పేర్కొనగా.. చలివాగులో నీటి మట్టాన్ని కొనసాగించడం సమస్యగా



మారిందని, సరఫరాలో వినియోగిస్తున్నవి పాత పైపులు కావడంతో తరచూ పగిలిపోతున్నాయని ఇంజినీర్లు వివరణ ఇచ్చారు. భూపాలపల్లి, పరకాలకు సాగునీరు అందడం లేదని ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పొంగులేటి జోక్యం చేసుకుని అన్ని ప్రాంతాలనూ సమన్వయం చేసుకుంటూ ఆయకట్టు అంతటికీ నీళ్లు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని తెలిపారు. తన నియోజకవర్గం పరిధిలోనూ ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని, ప్రజల్లో తిరగలేక పోతున్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఆవేదన వ్యక్తం చేశారు. రామప్ప నుంచి దేవన్నపేట వరకు నీటి తరలింపునకు సొరంగాలు పూర్తయ్యాయని, కమిషనింగ్ చేస్తే వెంటనే నీళ్లు ఇచ్చేందుకు వీలుందని ఇంజినీర్లు చెప్పారు. రామప్ప జలాశయం సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 1.3 టీఎంసీలకు మించి నిల్వ చేయనీయడం లేదని, ముంపు పేరుతో కొందరు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి అడ్డుకుంటున్నారని సమావేశంలో చర్చ చోటు చేసుకుంది.

## వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం వెంకటేష్ ఖని గుట్టపై స్వయంభూ గా వెలిసిన శ్రీ భూనీల సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణమహోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి దయతో అందరూ బాగుండాలని కోరుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో సన్మానం చేశారు.

## వేసవికి ముందే తాగునీటి కష్టాలు

**పట్టించుకోని అధికార యంత్రాంగం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ చంద్రుకుంట గ్రామంలో వేసవికి ముందే మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోలార్ సిస్టం ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కాని దాని నిర్వహణ సరిగా లేకపోవడంతో వాటర్ ప్లాంట్ పనిచేయడంలేదు. గ్రామగ్రామానికి మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా నిమిత్తం గ్రామంలో పైపులు ఏర్పాటు చేసినా అవి అలంకారప్రాయంగానే మారాయి. మంచినీటి కోసం తాము పడుతున్న ఇబ్బందుల గురించి పంచాయతీ సెక్రటరీకి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రశం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో మరింత తాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి నెలకొందని, తాము మంచినీటి నిమిత్తం ఎక్కడికి వెళ్లాలంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో నెలకొన్న మంచినీటి ఎద్దడి సమస్యను పరిష్కరిష్కరించాలని చంద్రుకుంట గ్రామ ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన మాజీ

## వార్డు కౌన్సిలర్ మోరే రూప



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మోరే భాస్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను సోమవారం మాజీ వార్డు కౌన్సిలర్ మోరే రూప ప్రారంభించారు. టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు , సాధన టీం క్రికెట్ క్రీడాకారుడైన మోరే భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం సాధన గ్రౌండ్లో మోరే భాస్కర్ కుమారుడు మోరే చాణిక్య ఆధ్వర్యంలో ఈ క్రికెట్ పోటీలను నిర్వహించారు.. ఆర్గనైజర్లుగా కిరణ్, వికాస్, వర్ధన్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## అద్దంకి దయాకర్ కు శుభాకాంక్షలు

## తెలిపిన కొప్పిశెట్టి దినేష్ కుమర్,



కూకట్ పల్లి , (ప్రజాస్ఫూర్తి) :కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటాలో అద్దంకి దయాకర్ ను ఎమ్మెల్సీగా అధిష్టానం నియమించడంతో గన్ పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం అక్కడినుంచి నామినేషన్ వేసేందుకు అభిమానులు కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ కొప్పిశెట్టి దినేష్ కుమార్,గంటశ్రీనివాస్ గౌడ్ లు పాల్గొని అద్దంకి దయాకర్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విద్యతో పాటు సంస్కారం

# అలవర్చుకుంటేనే.. సార్థకత

- శ్రీ చైతన్య పాఠశాలలో తల్లిదండ్రుల పాదపూజ మహోత్సవం
- దిల్ సుఖ్ నగర్ జోన్ ఏజీఎం టి సతీష్





చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: బాల్యం నుంచే విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం అలవర్చుకుంటేనే.. వారి జీవితానికి సార్థకత లభిస్తుందని శ్రీ చైతన్య పాఠశాలల దిల్ సుఖ్ నగర్ జోన్ ఏజీఎం టి సతీష్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు మంచి గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు కుటుంబ విలువలు, సమాజం పై అవగాహన, నైతిక విలువలు బోధపడతాయన్నారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ పేరెంట్స్ బి సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల గొప్పతనాన్ని వివరించారు. సరైన పద్ధతిలో పిల్లల పెంపకంపై పద్ధతి ద్వారా వివరించారు. నైతిక విలువలు, సత్ప్రవర్తనతో మెలుగుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల దిల్ సుఖ్ నగర్ జోన్ రీజనల్ ఇంచార్జ్ ఎం వెంకట్ రెడ్డి, హై స్కూల్ కో ఆర్డినేటర్ ఎ రఘువంశి, ప్రైమరీ కోఆర్డినేటర్ పి కామేశ్వరి, ప్రిన్సిపల్ శ్వేతా బాన్స్, అకాడమిక్ డీన్ దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె గోపి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదల్లో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి

## ఆర్థిక భద్రతనిస్తుంది

* **కార్పొరేటర్లు, పలువురు ప్రజాప్రతినిధులు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆపదల్లో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భద్రతను ఇస్తుందని కార్పొరేటర్లు, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ఆదేశాల మేరకు సోమవారం చింతల్ లోని బిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు హాజరై రూ. 21 లక్షల 46 వేల విలువగల 57 సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా సతమతమైతున్న నిరుపేదలకు కాస్త ఉపశమనం కల్పించేందుకు సీఎం సహాయనిది చెక్కులను నేడు లబ్ధిదారులకు అందజేశామన్నారు. రానున్న రోజుల్లో కూడా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి అందే విధంగా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, నాయకులు మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, అర్వ శంకరయ్య, పోలే శ్రీకాంత్, పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, సంపత్ గౌడ్, తెలంగాణ సాయి, యేసు, సుధాకర్, నదీమ్ రాయ్, దుర్గా రావు, మహిళ నాయకురాలు సంధ్య , లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుంది

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కొంపల్లిలో హెచ్ఎండీఎ నిధులతో రూ. 2.50 కోట్లతో మంజూరైన నూతన రోడ్లను ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా అపర్ణ కాలనీ,నూజివీడు కాలనీ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడిగా కేవలం 40 రోజులలోనే హెచ్ఎండీఎ నిధులతో రూ.2.50 లక్షలతో రాయల్ పార్క్ నుండి నూజివీడు బస్ స్టాప్ వరకు నూతన రోడ్లు మంజూరైనా సందర్భంగా ఆయా కాలనీలను పర్యవేక్షించారు. అనంతరం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించారు. కాలనీవాసులు కృతజ్ఞత సభ ఏర్పాటు చేసి పది సంవత్సరాల నుండి అభివృద్ధికి నోచుకొని మా కాలనీ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మా కల నెరవేర్చారాని కొనియాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం ఆగం ఐపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చెయ్యాలని చూస్తే సహించేది లేదన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కొంపల్లి ప్రజల తరపున ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్, శివకుమార్ గౌడ్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి,గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఎర్రోళ్ల కృష్ణ, రాము గౌడ్, ఎత్తిరాజా రావు, కావలి గోపాల్, అంజి ముదిరాజ్, షైక్ ఇబ్రహీం,కాలనీ అధ్యక్షులు నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరమణ,సెక్రటరీ మహేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సాగునీరు అందించాలి

**: కైరంకొండ అశోక్**

చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సాగునీరు ఏర్పాటు చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వ్యవసాయానికి సాగునీరు లేక రైతులు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, చేసేదేమీ లేక రైతులు వరి పంటలను పశువులకు పశుగ్రాసంగా వదిలేస్తున్నారన్నారు. ఇది కొనసాగితే సగానికి పైగా పంటలు సైతం ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండిన పంటలను సైతం పరిశీలించి, రైతులకు నష్టపరిహారం అందే విధంగా చూడాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సమావేశంలో కంచర్ల గోవర్ధన్ రెడ్డి, లగ్గోని పాండు, దిండు భాస్కర్, పబ్బు వంశీ, చింతపల్లి వినయ్ రెడ్డి, వికాస్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్పూర్తి) : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీ లో గల శ్రీ కార్యసిద్ధి గణపతి, శ్రీ సుబ్రమణ్య స్వామి, జంటనాగ, నవగ్రహ సహిత శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయము లో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేనీ చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అల్లం మహేష్, ప్రవీణ్ యాదవ్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాలయం, నవగ్రహాలు ప్రతిష్టాపన మహోత్సవం



జగద్గిరిగుట్ట,(ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్ నల్ల పోచమ్మ ఆలయంలో శివాలయం, నవగ్రహాలు ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం కార్పొరేటర్ గారు మాట్లాడుతూ విగ్ర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు రాజకుమార్, నారాయణ గౌడ్, చిన్న, కొలుకుల జై హింద్, బొగ్గుల సురేష్, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, గోవర్ధన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త తోట చంద్రయ్య హత్య కేసు సీఐడీకి..



అమరావతి: వైకాపా హయాంలో జరిగిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్య హత్య కేసును సీఐడీకి అప్పగించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కేసు దస్త్రాన్ని వెంటనే పంపాలని పోలీసు శాఖను ఆదేశించింది. వైకాపా నేతలు 2022 జనవరి 13న వెల్దుర్తి మండలం గుండ్లపాడులో చంద్రయ్య గొంతుకోసి దారుణంగా హతమార్చారు. హత్యకు ముందు జై జగన్ అనాలని బెదిరించారు.

# ఏఐతో విద్యాబోధన విద్యార్థుల పాలిట వరం

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) తో విద్యాబోధన విద్యార్థుల కు వరంగా మారనున్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం బూర్గంపాడు మండలం అంజనాపురం ఎంపీపీ ఎస్ పాఠశాలల్లో ఏఐతో విద్యా బోధన తరగతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన మరింత ఆకర్షణీయంగా, ఇంట్రాక్టివ్ గా నిర్వహించటానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెరుగ్గా సహకరిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ.. అందుకు తగినట్లు అభ్యాస కృత్యాలు జనరేట్ చేయడంతో విద్యాభ్యాసం పట్ల పిల్లల్లో మరింత ఉత్సాహం పెంచేలా బోధన చేయవచ్చు అన్నారు. విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్ లో కలెక్టర్ ముచ్చటిస్తూ చిన్నారులకు ఉత్సాహమే ప్రేరణగా ఆధారిత విద్యాబోధనను జిల్లాలో ప్రారంభించామన్నారు. కనుక పిల్లలందరూ నిరంతరంగా ప్రతిరోజు కంప్యూటర్ ల్యాబ్ ను వినియోగించాలని అన్నారు. బూర్గంపాడు మండలంలో అంజనాపురం, మొరంపల్లి బంజారా, బూర్గంపాడు 2, నాగినేని ప్రోలు , సారపాక లోని గాంధీనగర్ పాఠశా లలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఏఐ ఆధారిత బోధన లో భాగంగా మండలం నుంచి ఒక ఉపాధ్యాయుని





హైదరాబాదుకు ఏఐ విద్యా బోధనలో శిక్షణకు పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఐ ఆధారిత విద్య బోధనలో ఉపాధ్యాయుల తీరును సంబంధిత ఎంఈఓ లు పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని రోజువారీగా సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

* **బూర్గంపాడు ఆశ్రమ పాఠశాల, కళాశాల కలెక్టర్ ఆకస్మిక చతనిఖీ**

సందర్భంగా కలెక్టర్ పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, కిషన్ షెడ్ పాఠశాల ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యా తరగతులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల కు పుస్తక పఠనంలో ఉన్న నైపుణ్యాన్ని హిందీ పాఠ్యపుస్తకాన్ని చదివించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూవారికి గల ఆసక్తి పాఠశాలలో విద్యాబోధన, అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో రోజు వారి అమలు చేస్తున్న మెనూ ప్రకారం, లెసన్ ప్రణాళికలు, టాయిలెట్స్ నిర్వ హణలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదవటానికి వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కావలసిన ప్రణాళికలను రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

* **నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన.**

ఈ సందర్భంగా కలెక్టర్ మొరంపల్లి బంజరు లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాపనకు వేపలగడ్డ బస్టాండ్ సమీపంలో సూచించిన నాలుగు ఎకరాల భూమిని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట బూర్గంపాడు డిప్యూటీ తాసిల్దార్ నరేష్, బూర్గంపాడు ఎంఈఓ, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు, మందిత అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండిపోతున్నాయి

**: హరీశ్‌రావు**

జనగామ టౌన్: కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి చుక్క ఒడిసిపట్టారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రతి చుక్కను విడిచిపెడుతున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శిం చారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లా డుతూ.. రేవంత్‌రెడ్డికి పరిపాలన దక్షత లేదన్నారు. ''నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయి. వరంగల్ జిల్లాలోనే లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతోంది. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండిపోతున్నాయి. సీఎం తన చేతకానితనానికి ప్రకృతి పేరు చెప్పి తప్పించుకోవాలని యత్నిస్తున్నారు'' అని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోన్న విధానాలతోనే కరవు ఏర్పడిందని మాజీ మంత్రి హరీ శ్‌రావు విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 33 రోజులు పంపులను ఆన్ చేయకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగునీటి కరవుతో లక్ష ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లడంతో దక్షిణ తెలంగాణలో కూడా కరవు ఏర్పడిందన్నారు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్లు రాష్ట్రంలో 20 20 క్రికెట్ పాలన కాకుండా.. 20 శాతం కమీషన్ల పాలన చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఎయిర్ పోర్టులో త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

* **విమాన ల్యాండింగ్‌కు శంషాబాద్ ఎయిర్ పోర్టు ఏటీసీ అధికారుల అనుమతి**
* **అదే సమయంలో రన్‌వేపై టేకాఫ్‌కు సిద్దంగా మరో విమానం**
* **పైలట్ అప్రమత్తతతో విమానాన్ని వెంటనే టేకాఫ్ చేసి, కొద్ది సేపు చక్కర్లు కొట్టించిన వైనం**



ఇండిగో ఎయిర్ లైన్స్ విమాన పైలట్ అప్ర మత్తత కారణంగా హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పింది. ఎయిర్ పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..గోవా నుంచి 150 మంది ప్రయాణికులతో ఇండిగో ఎయిర్ లైన్స్ 6 ఈ 6973 విమాన సర్వీసు శంషాబాద్ మీదుగా విశాఖకు బయలుదేరింది. ఈ క్రమంలో ఈ విమానానికి శంషాబాద్ ఎయిర్ పోర్టులో ల్యాండింగ్ చేయడానికి ఏటీసీ అధికారులు అనుమతించడంతో పైలట్ విమానం హైడ్రాలిక్ గేర్‌ను సిద్ధం చేశాడు. విమాన సర్వీసును డౌన్ చేసిన పైలట్.. అప్పటికే రన్ వేపై టేకాఫ్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న మరో విమానాన్ని గమనించి అప్రమత్తమయ్యాడు. వెంటనే తన విమానాన్ని టేకాఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. పది నిమిషాల సేపు గాల్లో చక్కర్లు కొట్టిన తర్వాత పైలట్ విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేశాడు. దీంతో అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఆ విమాన సర్వీస్ విశాఖకు వెళ్లిపోయింది. అయితే.. రన్ వేపై టేకాఫ్ తీసుకోవడానికి ఒక విమానం ఉండగా, మరో విమానం ల్యాండింగ్‌కు ఏటీసీ అనుమతి ఇవ్వడాన్ని ప్రయాణికులు తప్పుబడుతున్నారు. ఏది ఏమైనా పైలట్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పడంతో అతన్ని అభినందిస్తున్నారు.

## వర్మకు చెక్ పెట్టాల్సిన అవసరం ఏముంది?

**: మంత్రి నాదెండ్ల మనోహర్**

అమరావతి: పిఠాపురం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అడ్డా అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల అంశంపై ఆయన స్పందించారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. ''పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సీనియర్ నేత. ఆయన అంశం తెదేపా అంతర్గత వ్యవహారం. వర్మకు చెక్ పెట్టాల్సిన అవసరం ఏముంది? ఈనెల 14న సాయంత్రం 4 గంటలకు పిఠాపురం మండలం చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభ నిర్వహిస్తాం. పిఠాపురం ప్రజలకు కృతజ్ఞత చెప్పేందుకే దీన్ని ఏర్పాటు చేశాం. సభ పూర్తయ్యాక పారిశుద్ధ్య బాధ్యత కూడా మేం తీసుకుంటాం. పర్యావరణం గురించి ఏ పార్టీ ఇంతలా ఆలోచించదు''అని నాదెండ్ల మనోహర్ అన్నారు.

## పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు

**: సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్: ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయని.. అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు సీఎం చెప్పారు. 39 సార్లు కాకుంటే 99 సార్లు దిల్లీ పోతాం.. తప్పేంటని సీఎం ప్రశ్నించారు. సందర్భం వస్తే నిధుల విషయంలో దిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎల్పీలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''మెట్రో తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే నిధులు అడుగుతున్నాం. ఎన్‌హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల రాజేందర్ కాదా? భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని అన్నప్పుడు మాతో కదా చర్చించాలి. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కిషన్ రెడ్డి ఎందుకు రాలేదు. కేసీఆర్ బాధపడుతారని కిషన్‌రెడ్డి రాలేదా? పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమీక్ష పెడితే ఎందుకు రాలేదు? ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాజెక్టులు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. హైదరాబాద్ అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలని మేం భావిస్తున్నాం. రాష్ట్రానికి నిధులు రాకూడదని భారాస చూస్తోంది. రాష్ట్రాభివృద్ధి, కేంద్ర నిధులపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధం కావాలి. చర్చకు నేను, భట్టి విక్రమార్క రావడానికి సిద్ధంగా ఉన్నాం. అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తాం. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించేందుకు సీఎం స్థాయి సరిపోదా? పీసీసీ అధ్యక్షుడిగా కేసీఆర్‌ను గద్దెదింపి అధికారంలోకి వచ్చాం. భారాస హయాంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు. మందకృష్ణ మాదిగ అంటే నాకు గౌరవం ఉంది. పోటీ పరీక్షల ఫలితాలకు.. రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదు. మందకృష్ణ భాజపా నేతలా మాట్లాడితే ఎలా? గతంలో ఎప్పుడో వచ్చిన నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గకరణ అంశం వర్తించదు. ఏదైనా చేయాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కేటీఆర్, కిషన్‌రెడ్డి కలిసి తిరుగుతున్నారని నేను చెబుతున్నా'' అని సీఎం పేర్కొన్నారు.

## తెలంగాణలో నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్ల పర్వం

* **తెలంగాణలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు**
* **మార్చి 20న పోలింగ్**
* **నేడు నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు**




తెలంగాణలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 20న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు నేడు చివరి తేదీ. ఎమ్మెల్యే సీట్ల సంఖ్యను బట్టి ఐదు స్థానాల్లో నాలుగు అధికార పక్షానికి, ఒకటి బీఆర్ఎస్ కు వెళతాయి. కాంగ్రెస్ పార్టీ తనకు లభించిన నాలుగు ఎమ్మెల్సీల్లో ఒక స్థానాన్ని మిత్ర పక్షం సీపీఐకి కేటాయించింది. మిగిలిన మూడు స్థానాలకు కాంగ్రెస్ నిన్న తన అభ్యర్థులను ప్రకటించింది. విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ లకు ఎమ్మెల్సీ చాన్స్ ఇచ్చింది. సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ బరిలో ఉన్నారు. వీరు నేడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

# కేవీ ప్రవేశాల్లో ఎంపీల కోటా పునరుద్ధరణపై కేంద్రం మరోసారి క్లారిటీ

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు పార్లమెంటు సభ్యులకు గతంలో ఇచ్చిన కోటాను (MP Quota) పునరుద్ధరించే అంశంపై కేంద్రం మరోసారి క్లారిటీ ఇచ్చింది. ఈ కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన లేదని తేల్చి చెప్పింది. లోక్‌సభలో జేడీయూ ఎంపీ రాంప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తూ




బదిలీ అయ్యే ఉద్యోగుల పిల్లల విద్యావసరాలను తీర్చేందుకు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా దేశవ్యాప్తంగా ఒకేరకమైన విద్య అందుతుంది. అయితే, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఈ ప్రవేశాల్లో ఉండే ఎంపీ కోటా సహా పలు ప్రత్యేక ప్రొవిజన్లను గతంలో ఉపసంహరించుకుంది. ఈ ప్రత్యేక కోటాలు తరగతి గది సంఖ్యకు మించి ఉండటంతో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి అధికంగా ఉండేది. అందువల్ల తరగతి గదిలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆరోగ్యకరంగా ఉండేలా చూడటం, వ్యవస్థలో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న జాతీయ విద్యా విధానం లక్ష్యానికి అనుగుణంగా ఉత్తమ అభ్యాసన ఫలితాలు సాధించేందుకు ఈ కోటాలను తొలగించారు. ప్రస్తుతం ఈ కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ కేంద్రం వద్ద లేదు" అని విద్యాశాఖ మంత్రి పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు విద్యార్థులను సిఫార్సు చేసే పలు ప్రత్యేక కోటాలను కేంద్రం 2022 ఏప్రిల్‌లో రద్దు చేసింది.

## నన్ను కొట్టలేదు..
# కానీ మాటలతో వేధించారు

: నటి రన్యారావు



డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) కస్టడీలో తనను మాటలతో వేధించారని నటి రన్యారావు వెల్లడించారు. కొట్టలేదు కానీ బెదిరించారని కోర్టులో వెల్లడించారు. దాంతో తాను మానసికంగా ఎంతో వేదనకు గురయ్యానని చెప్తూ ఉద్వేగానికి గురయ్యారు. దుబాయ్ నుంచి బంగారు బిస్కెట్లను అక్రమంగా తీసుకువస్తూ నటి రన్యారావు బెంగళూరులో దొరికిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి బెంగళూరు కోర్టులో విచారణ జరిగింది. కస్టడీలో ఆమెను ఏరకంగానూ వేధింపులకు గురిచేయలేదని దర్యాప్తు అధికారి తెలిపారు. ''మేం అడిగిన ఏ ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వడం లేదు. మౌనంగా ఉండిపోతోంది. ఆధారాలు చూపించి, దానిపై ప్రశ్నించినా ఆమె బదులివ్వడం లేదు. ఆమె కోర్టు వద్దకు రాగానే.. ఏం మాట్లాడాలో తన న్యాయవాదులు సూచించారు. ఇక మా దర్యాప్తు ప్రక్రియ మొత్తాన్ని మేం రికార్డ్ చేశాం'' అని తెలిపారు. అలాగే రన్య వాదనపై స్పందించిన కోర్టు..'' మీ న్యాయవాదితో మాట్లాడేందుకు మీకు 30 నిమిషాల సమయం ఇచ్చాం. ఆ వేధింపుల విషయం వారికి ఎందుకు చెప్పలేదు. ఆ అంశంపై వారు పిటిషన్ ఎందుకు వేయలేదు'' అని ప్రశ్నించారు.

రన్య: నేను దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నాను. కానీ వారు మాత్రం నన్ను పేపర్లపై సంతకం చేయమని ఒత్తిడి చేస్తున్నారు. వారు నా ఇంటిని ఎందుకు మ్యాపింగ్ చేస్తున్నారు. ఆ అవసరం ఏముంది..? నన్ను గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి, వారు చెప్పినదాన్ని పాటించమంటున్నారు. ప్రామిస్ చేసి, చెప్తున్నా వారు ఇలాగే ప్రవర్తిస్తున్నారు.

న్యాయమూర్తి: భయపడాల్సిన పనేంలేదు. ఏమైనా ఆందోళనలు ఉంటే, మీ లాయర్లతో చెప్పి పిటిషన్ వేయండి. దర్యాప్తు ప్రక్రియ అంతా వీడియోలో రికార్డు అయింది. కాగా, ఈ ఆరోపణలను డీఆర్ఐ తరఫు న్యాయవాది తోసిపుచ్చారు. ఇక విచారణ అనంతరం ఆమెకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

# అస్సాంకు సొంత శాటిలైట్..! ఇస్రోతో చర్చలు

గువహాటి: రాష్ట్ర అవసరాల కోసం సొంతగా ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకోనున్నట్లు అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దులపై నిఘా ఉంచడంతోపాటు సామాజిక ఆర్థిక ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు దోహదం చేస్తుందని తెలిపింది. దీంతో దేశంలో సొంత ఉపగ్రహం కలిగిన తొలి రాష్ట్రంగా అస్సాం నిలువనుంది. ''ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ సహకారంతో రాష్ట్రం కోసం ప్రత్యేకంగా ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నాం. కీలకమైన ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు ఇదెంతో దోహదం చేస్తుంది'' అని ఆర్థికమంత్రి అజంతా నియోగ్ వెల్లడించారు. 2025 26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆమె.. వ్యవసాయం, విపత్తు నిర్వహణ,



మౌలిక సదుపాయాల అభివృద్ధి, సరిహద్దు నిర్వహణ, పోలీస్ ఆపరేషన్లలో కీలక సేవలు అందిస్తుందని చెప్పారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ.. రాష్ట్రానికి సొంతగా ఉపగ్రహం ఉంటే విదేశీయుల అక్రమ చొరబాట్లను అడ్డుకోవచ్చన్నారు. వాతావరణ నివేదిక ద్వారా రాబోయే వరదల గురించి ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. ఇటీవల ఉమ్రాంగ్సోలో చోటుచేసుకున్న బొగ్గు గని ప్రమాదాన్ని ప్రస్తావించిన ఆయన.. ఉపగ్రహ సమాచారాన్ని పొందేందుకు నెలన్నర సమయం పట్టిందన్నారు. సొంతగా ఉపగ్రహం ఉండటం వల్ల అది మన ప్రాంతంపైనే పూర్తి నిఘా ఉంచుతుందన్నారు. దీని ఏర్పాటు కోసం ఇస్రోతో చర్చలు మొదలుపెట్టామని ముఖ్యమంత్రి హిమంత వెల్లడించారు.

# పన్నులు తగ్గించాలని కోరవద్దు

: కేంద్రమంత్రి గడ్కరీ

దిల్లీ: జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పరిశ్రమ వర్గాలకు సూచించారు. పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి నిధులు అవసరం కాబట్టి.. జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కోరారు. ఒకవేళ పన్నులు తగ్గిస్తే.. మరింత తగ్గించాలని కోరతారని, ఇది మనుషుల మనస్తత్వమని ఆయన వ్యాఖ్యానించారు. తాము కూడా పన్నులు తగ్గించడానికి



అనేక ప్రయత్నాలు చేస్తున్నామని..కానీ దాని వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ధనవంతుల నుంచి పన్నులు వసూలు చేసి.. పేదల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ దార్శనికత అని మంత్రి అన్నారు. దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9 శాతానికి తగ్గుతుందని పరిశ్రమ వర్గాలకు మంత్రి హామీ ఇచ్చారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8 శాతం ఉండగా.. యూఎస్, ఐరోపా దేశాల్లో 12 శాతం ఉందని తెలిపారు. మూలధన పెట్టుబడులను పెంచడం ద్వారా భవిష్యత్తులో దేశంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించవచ్చన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



# తుపాకీ గురిపెట్టి..
## రూ.25 కోట్ల విలువైన నగల చోరీ!

పట్నా: బంగారు ఆభరణాల షోరూంలో చోరీ జరిగింది. కొందరు దుండగులు సిబ్బందిపై తుపాకీ గురిపెట్టి నగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బిహార్‌లో చోటు చేసుకొంది. దాదాపు రూ.25 కోట్ల విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఆరాలో ఉన్న షోరూమ్‌ను రోజూలాగే సోమవారం ఉదయం 10 గంటలకు తెరిచారు. కాసేపటికే ఎనిమిది, తొమ్మిది మంది దుండగులు తుపాకులతో లోనికి ప్రవేశించారు. వారిలో పలువురు ముఖాలకు హెల్మెట్, మంకీ క్యాప్‌లు ధరించారు. సెక్యూరిటీ వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్దనున్న ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి షోరూంలోని నగలను అపహరించారు. సిబ్బందిలో ఒకరిపై దాడి చేశారు. ఈ దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే నిందితులు పరారయ్యారు. వారిని వెంబడిస్తూ వెళ్లిన పోలీసులు నిందితులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులకు గాయాలయ్యాయి. ''ఆభరణాలే కాకుండా నగదుతో నిందితులు పరారయ్యారు. ఎంత డబ్బు కాజేశారో తెలియాల్సి ఉంది'' అని షోరూం మేనేజర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జాతీయ విద్యా విధానంపై
# ఆందోళన.. లోక్‌సభలో డీఎంకే VS భాజపా

దిల్లీ: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు అధికార పార్టీ డీఎంకే వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశాన్ని లోక్‌సభలో డీఎంకే ఎంపీలు లేవనెత్తడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎంపీల చర్యపై స్పందించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మండిపడ్డారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేసి.. తిరిగి ప్రారంభించారు. కొత్త విద్యా విధానాన్ని తమిళనాడులో అమలు చేయడంపై డీఎంకే ఎంపీలు నిరసిస్తూ వెల్ వైపు వెళ్లడంతో కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ విద్యావిధానంపై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ''విద్యార్థుల భవిష్యత్తుతో డీఎంకే చెలగాట మాడుతోంది. వారంతా నిజాయతీ లేని వారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు డీఎంకే సిద్ధంగా లేదు. భాష పరమైన వివాదాలు సృష్టించడమే వారు పనిగా పెట్టుకున్నట్లున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. వారి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం'' అని ఆరోపించారు.

*** ఓటరు జాబితాపై చర్చ జరగాలి: రాహుల్**

ఈ క్రమంలోనే స్పీకర్ సభను వాయిదా వేసి తిరిగి ప్రారంభించారు. ప్రధాన్ వ్యాఖ్యలపై డీఎంకే నిరసన వ్యక్తంచేసింది. అనంతరం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు.



ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయన్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ''ఓటరు జాబితాపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ జాబితాపై చర్చలు జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి'' అని కాంగ్రెస్ అగ్రనేత పేర్కొన్నారు.

# మాజీ సీఎం కుమారుడి నివాసంలో ఈడీ సోదాలు

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ కుమారుడు చైతన్య నివాసంలో సోమవారం ఈడీ సోదాలు నిర్వహించింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ తనిఖీలు జరిగాయని సంబంధిత అధికారులు వెల్లడించారుమొత్తం 15 ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. వాటిలో భిలాయి ప్రాంతంలో ఉన్న చైతన్య భగేల్ నివాసం కూడా ఉంది. ఈ తనిఖీల నేపథ్యంలో భగేల్ కార్యాలయం నుంచి స్పందన వచ్చింది. ''ఏడు సంవత్సరాలు నడిచిన తప్పుడు కేసును కోర్టు కొట్టివేసింది. కానీ ఇప్పుడు ఈడీ అతిథులు వచ్చి భగేల్ నివాసంలో తనిఖీలు చేశారు'' అని మండిపడింది. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. మద్యం సిండికేట్‌కు రూ.రెండువేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఈడీ గతంలో పేర్కొంది. దర్యాప్తులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు వ్యాపారవేత్తలను అరెస్టు చేసింది.

## పన్ను తగ్గింపులు అడగొద్దు..

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రిక్వెస్ట్..!



**న్యూఢిల్లీ:** పన్ను తగ్గింపులు కోరవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కార్ల పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వానికి డబ్బు అవసరమన్నారు. భారత్‌లో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9శాతానికి తగ్గుతుందన్నారు. జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని డిమాండ్ చేయొద్దన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని.. పన్నులు తగ్గిస్తే.. మరింత డిమాండ్ చేస్తారన్నారు. ఇది మానవ మస్తత్వం అన్నారు. తాము పన్నులను తగ్గించాలని అనుకుంటున్నామని.. కానీ పన్నులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. ధనవంతుల నుంచి పన్నులు తీసుకొని పేదలకు ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ దార్శనికత అని.. ప్రభుత్వానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు.

ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 14-16 శాతంగా ఉందని.. రాబోయే రెండేళ్లలోపు లాజిస్టిక్స్ ఖర్చు 9శాతానికి తగ్గుతుందని హామీ ఇచ్చారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పోటీతత్వాన్ని కలిగి ఉంటామన్నారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8శాతం ఉండగా.. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఇది 12 శాతం ఉందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా భారత పరిశ్రమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మూలధన పెట్టుబడిని పెంచడం ద్వారా భారతదేశం మరిన్ని ఉద్యోగాలను సృష్టించబోతోందని చెప్పారు. 'మీరంతా సంపద సృష్టికర్తలు మాత్రమే కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు'. ఈ స్వర్ణ యుగాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి' అంటూ పిలుపునిచ్చారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు దిగుమతులను తగ్గించి.. ఎగుమతులను పెంచాల్సిన అవసరాన్ని గడ్కరీ నొక్కి చెప్పారు.

## చివరి గంటలో లాభాలు ఆవిరి..!

### నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అన్నిరంగాల్లో అమ్మకాలు కనిపించాయి. ఉదయం మార్కెట్లు లాభాల్లో మొదలైనా.. చివరి సెషన్‌లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం.. 74,474.98 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత అదే ఉత్సాహం మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 74,741.25 గరిష్ఠానికి చేరుకుంది. అయితే, చివరి సెషన్‌లో లాభాల స్వీకరణకు దిగడంతో ఒక్కసారిగా మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 74,022.24పాయింట కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 217.41 పాయింట్లు తగ్గి.. 74,115.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92.20 పాయింట్లు తగ్గి.. 22,460.30 వద్ద ముగిసింది. మొదటి అర్ధభాగంలో నిఫ్టీ 22,650 పాయింట్ల మార్క్‌ను ధాటడంతో లాభాలను ఆర్జించింది.

కానీ, చివరి గంటలో లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, ఓఎన్‌జీసీ, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో నిఫ్టీలో ప్రధాన నష్టాలను చవిచూశాయి. పవర్ గ్రిడ్ కార్ప్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్, నెస్లే ఇండియా లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం తగ్గింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం పతనమైంది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి రెండుశాతం క్షీణించాయి. వేదాంత్ ఫ్యాషన్స్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఆస్ట్రల్, షాపర్స్ స్టాప్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఈకేఐ ఎనర్జీ, శివ సిమెంట్, పీఎన్‌బీ గిల్ట్స్ తదితర 120కి పైగా స్టాక్‌లు బీఎస్‌ఈలో 52 వారాల కనిష్ఠానికి పడిపోయాయి.

## ప్రపంచ వ్యాప్తంగా నిలిచిన ఎక్స్ సేవలు..

### సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యూజర్లు



**న్యూయార్క్:** అమెరికన్ టైకూన్, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఆధీనంలోని ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్ (ఎక్స్) ఇటీవలే మాటిమాటికీ సతాయిస్తోంది. ఏదో ఒక సమస్యతో యూజర్లను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటీవలే ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడటం.. లాగిన్ కాకపోవడం, ట్వీట్స్ మాయం కావడం వంటి సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ఎక్స్‌లో ఇలాంటి సమస్యే తలెత్తింది.

సోమవారం మధ్యాహ్నం ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్ సేవలు నిలిచిపోయాయి. సైట్ ఓపెన్ కావడం లేదు. లాగిన్ అయినా యాక్సిస్ చేయలేక యూజర్లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వరుసగా పోస్టులు పెడుతున్నారు. దాదాపు అరగంట నుంచి ఎక్స్ సేవలు స్తంభించిపోయినట్లు పేర్కొంటున్నారు. ఎక్స్ సైట్‌ను ఓపెన్ చేయగా.. స్క్రీన్‌పై 'సమ్‌థింగ్ వెంట్ రాంగ్.. ప్లీజ్ ట్రై అగెయిన్' అన్న సందేశం వస్తున్నట్లు తెలిపారు.

డౌన్‌డిటెక్టర్ నివేదిక ప్రకారం.. భారత్‌లో 2 వేల మంది, అమెరికాలో 18,000, యూకేలో 10,000 మంది ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఎక్స్ అంతరాయానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. చాలా మంది వినియోగదారులు సర్వర్ డౌన్ అయినట్లు ఫిర్యాదు చేశారు. ఈ అంతరాయం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు ఒకింత గందరగోళానికి గురయ్యారు.

# టీమిండియాపై బీసీసీఐ ప్రశంసలు..

### జడేజాకు బెస్ట్ ఫీల్డర్ అవార్డు

**దుబాయ్:** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025ని గెలుచుకున్న టీమిండియా జట్టుపై బీసీసీఐ ప్రశంసలు కురిపించింది. భారత క్రికెట్ జట్టు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని, ఆ హోదాలోనే విజేతగా నిలిచిందని, వన్డేలు.. టీ20ల్లో ఇండియా టాప్ ర్యాంక్ జట్టుగా కొనసాగుతున్నట్లు బీసీసీఐ ఇవాళ తన ప్రకటనలో పేర్కొన్నది. రోహిత్ సేన అత్యద్భుత ప్రదర్శన ఇచ్చిందని, అన్ని సవాళ్లను ఎదుర్కొన్నదని, నిర్భయంగా.. క్రమశిక్షణతో టోర్నీలో విజేతగా నిలిచినట్లు బీసీసీఐ వెల్లడించింది. ప్రపంచ టోర్నీల్లో విజయకాంక్షతో భారత్ దూసుకెళ్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

ఆదివారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఇండియా తన సత్తా చాటినట్లు బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన ప్రకటనలో తెలిపింది. చరిత్రాత్మక విజయంలో కెప్టెన్ రోహిత్ శర్మ పాత్రను బీసీసీఐ విశేషంగా కొనియాడింది. రోహిత్‌లోని






అసాధారణ నాయకత్వ లక్షణాలు.. జట్టును గెలుపుబాటలో నిలపడంలో సక్సెస్ అయ్యిందని ప్రకటనలో తెలిపారు. రోహిత్ నేతృత్వంలో ఇండియా రెండోసారి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకున్నదని బీసీసీఐ తెలిపింది. 2024 టీ20 వరల్డ్‌కప్‌తో పాటు 2025 చాంపియన్స్ ట్రోఫీ విజయంతో.. రోహిత్ ఓ సక్సెస్‌ఫుల్ కెప్టెన్ అయ్యారని పేర్కొన్నది.

ప్రధాన కోచ్ గౌతం గంభీర్ పాత్రను కూడా బీసీసీఐ మెచ్చుకున్నది. గంభీర్ సాహసోపేత విధానం, వ్యూహాలు.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నది. భారత క్రికెట్‌లో ఈ విజయం ఓ మైలురాయి అని బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ తెలిపారు. వత్తిడిలో జట్టు ఆడిన తీరు అద్భుతమని బీసీసీఐ గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఐసీసీ టైటిల్‌ను గెలవడం ఎప్పటికీ ప్రత్యేకమే అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. అత్యద్భుత నైపుణ్యాన్ని, ఐక్యతను జట్టు చాటిందని బీసీసీఐ ట్రెజరర్ ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా తెలిపారు.

ఇక ఫైనల్లో అద్భుత ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్న రవీంద్ర జడేజాకు.. ఫీల్డర్ ఆఫ్ ద మ్యాచ్ మెడల్ దక్కింది. జట్టు ఫిజియో ఆ మెడల్‌ను అందజేశాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో .. బెస్ట్ ఫీల్డర్ మెడల్ బహూకరించారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ ప్రజెంటేషన్ సెర్మనీపై వివాదం..

### విస్మయం వ్యక్తం చేసిన షోయెబ్ అక్తర్..

**దుబాయ్:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను భారత్ గెలుచుకున్న విషయం తెలిసిందే. అయితే కప్ ప్రజెంటేషన్ సమయంలో.. వేదికపై ఒక్క పాకిస్థానీ ప్రతినిధి కూడా లేరు. వాస్తవానికి చాంపియన్స్ ట్రోఫీని ఈసారి ఆర్గనైజ్ చేసింది పాకిస్థాన్ క్రికెట్ బోర్డే. కానీ ఆదివారం రాత్రి దుబాయ్ స్టేడియంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాకిస్థాన్ ప్రతినిధి లేకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి.



న్యూజిలాండ్‌పై ఉత్కంఠభరిత ఫైనల్లో నాలుగు వికెట్ల తేడాతో ఇండియా నెగ్గింది. ఐసీసీ చైర్మెన్ జే షా చేతులు మీదుగా కప్‌ను రోహిత్ సన అందుకున్నది. అయితే ప్రజెంటేషన్ వేదికపై బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి దేవజిత్ సాకియా, న్యూజిలాండ్ క్రికెట్ డైరెక్టర్ రోజర్ టౌస్ కూడా పాల్గొన్నారు. కానీ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన పాకిస్థాన్ ప్రతినిధులు ఎవరూ ప్రజెంటేషన్ సమయంలో లేకపోవడం విస్మయానికి గురి చేసింది. పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ అహ్మద్.. దుబాయ్‌లోనే ఉన్నా.. ఆయన ఆ కార్యక్రమంలో పాల్గొనలేకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ మోషిన్ నఖ్వీ.. దుబాయ్‌కు వెళ్లలేదు. కేంద్ర మంత్రితో అత్యవసర భేటీ వల్ల ఆయన దుబాయ్‌కు వెళ్లలేదని తెలుస్తోంది. ఇస్లామాబాద్‌లో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్నట్లు ఐసీసీకి ఆయన సమాచారం ముందుగానే అందజేశారు. ప్రజెంటేషన్ సమయలో ఒక్క పాకిస్థాన్ అధికారి లేకపోవడం పట్ల మాజీ ఫాస్ట్ బౌలర్ షోయెబ్ అక్తర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. స్టేజ్ సెర్మనీకి కనీసం ఒక్క పీసీబీ ప్రతినిధి వెళ్లకపోవడం వెనుక ఉన్న కారణం అర్థం కావడం లేదని షోయెబ్ అక్తర్ పేర్కొన్నాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని ఇండియా గెలిచింది వాస్తవమే అని, కానీ పాకిస్థాన్ ఆ టోర్నీని నిర్వహించిందని, కానీ ట్రోఫీ ప్రజెంటేషన్‌కు ఒక్క పీసీబీ ప్రతినిది వెళ్లకపోవడం విస్మయానికి గురి చేస్తోందన్నాడు. తన ఎక్స్ అకౌంట్‌లో ఈ అంశంపై ఓ వీడియోను పోస్టు చేశాడు.

పోడియంపైకి ఎవరు రావాలన్న దానిపై ఐసీసీయే తుది నిర్ణయం తీసుకుంటుందని, కానీ పీసీబీ ప్రతినిధి సుమేర్ అక్కడే ఉన్నా..ఆయన తన పోడియం మీదకు పిలువలేదని ఆరోపణలు ఉన్నాయి.

## ఐపీఎల్ నిర్వాహకులకు కేంద్రం కీలక సూచన..

### ఆ వాణిజ్య ప్రకటనలు వద్దు!

### మార్చి 22 నుంచి ఐపీఎల్-18

### మద్యం, పొగాకు వాణిజ్య ప్రకటనలను నిషేధించాలన్న కేంద్రం

### ఐపీఎల్ నిర్వాహకులకు స్పష్టం చేసిన కేంద్ర వైద్య శాఖ




**ముంబై:** సిసలైన క్రికెట్ వినోదానికి కేరాఫ్ అడ్రెస్ గా నిలిచే ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఐపీఎల్ 18వ ఎడిషన్ పోటీలు మార్చి 22న జరిగే తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంప్ కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి.

ఐపీఎల్ లో పొగాకు, మద్యం ప్రకటనలు ఇవ్వొద్దని స్పష్టం చేసింది. టోర్నీలో మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించాలని కేంద్ర వైద్య శాఖ సూచించింది. కాగా, 10 జట్లు పాల్గొనే ఐపీఎల్ తాజా సీజన్ లో మార్చి 22 నుంచి మే 25 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో, ఐపీఎల్ నిర్వాహకులకు కేంద్రం కీలక సూచనలు చేసింది.

## రిటైర్మెంట్ వార్తలకు చెక్‌పెట్టిన రోహిత్ శర్మ..

**న్యూఢిల్లీ:** తన రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలను టీమిండియా సారథి రోహిత్ శర్మ క్లారిటీ ఇచ్చాడు. న్యూజిలాండ్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి మూడోసారి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో 76 పరుగులతో అజేయంగా నిలిచి.. మ్యాచ్‌లో కీలకపాత్ర పోషించిన రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. తన రిటైర్మెంట్ గురించి ఊహాగానాలకు తెర దించాడు. తాను వన్డే ఫార్మాట్ నుంచి ఇప్పుడే రిటైర్ కాబోవడం లేదని తెలిపాడు. దయచేసి ఎవరూ పుకార్లు వ్యాప్తి చేయొద్దని కోరాడు. ఈ ప్రశ్న విని తాను ఆశ్చర్యం వేసిందని చెప్పాడు. భవిష్యత్ ప్రణాళిక ఏమీ లేదని.. ఏం జరగాలని ఉందో అదే జరుగుతుందని పేర్కొన్నాడు.

చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం నుంచే తొలి బంతి నుంచే దూకుడుగా ఆడుతున్న రోహిత్ శర్మ.. కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో రాణించాడు. అంతకు ముందు ఆస్ట్రేలియా పర్యటనలో ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. ఫామ్ లేమితో ఇబ్బందిపడుతున్న రోహిత్ శర్మపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాల్సిన టైమ్ వచ్చిందని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు సైతం రోహిత్ శర్మ చాంపియన్స్ ట్రోఫీ తర్వాత రిటైర్ అయ్యే అవకాశం ఉందని ఊహానాగాలు వచ్చాయి. తాజాగా



వాటన్నింటికి రోహిత్ ఫుల్‌స్టాప్ పెట్టాడు.

ఆస్ట్రేలియా పర్యటనలో టెస్ట్ సిరీస్‌లో పేలవమైన ఫామ్‌తో ఇబ్బంది పడిన రోహిత్, తనకు ఇష్టమైన ఫార్మాట్‌లో తిరిగి ఫామ్‌లోకి తిరిగివచ్చాడు. హాఫ్ సెంచరీతో మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. ఫైనల్‌లో విజయం తర్వాత రోహిత్ మాట్లాడుతూ ఫలితం వైపు ఉండడం మంచి అనుభూతిని ఇచ్చిందని చెప్పాడు. తన బ్యాటింగ్‌పై స్పందిస్తూ.. తాను సహజంగా అలా ఆడనని.. కానీ అలా చేయాలని అనుకుంటున్నానని.. భిన్నంగా ఏదైనా చేసినప్పుడు జట్టు, మేనేజ్‌మెంట్ మీతోనే ఉంటాయని చెప్పాడు. ఈ విషయంలో గతంలో ఈ విషయంపై రాహుల్ ద్రవిడ్‌తో మాట్లాడానని.. ప్రస్తుతం గౌతమ్ గంభీర్‌తో మాట్లాడానని తెలిపాడు. ఇన్నేళ్లు వేరే శైలిలో ఆడానని.. ఇప్పుడు మరో శైలితో ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నాడు.

ఆల్ రౌండర్ల గురించి మాట్లాడుతూ తనకు స్వేచ్ఛగా ఆడేందుకు అవకాశం లభించిందని.. జడేజా ఎనిమిదో స్థానంలో వస్తున్నాడని.. ఇది నాకు స్వేచ్ఛగా ఆడేందుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నాడు. ఇక కేఎల్ రాహుల్‌ను ప్రశంసిస్తూ.. అతను ఒత్తిడిలో భయపడడని.. అందుకే మేము మిడిల్ ఓవర్లలో అతన్ని తీసుకోవాలని కోరుకున్నట్లు తెలిపాడు. బ్యాటింగ్ చేసినప్పుడు.. చాలా ప్రశాంతంగా.. పరిస్థితికి అనుగుణంగా ఆడతాడని పేర్కొన్నాడు. హార్దిక్ వంటి ఇతర బ్యాట్స్‌మెన్‌లకు స్వేచ్ఛ ఇస్తాడని చెప్పాడు. తొమ్మిది వికెట్లు తీసిన వరుణ్ చక్రవర్తిని ప్రశంసిస్తూ అతను భిన్నంగా ఉంటాడని.. దుబాయిలాంటి పిచ్‌లపై ఆడినప్పుడు న్యూజిలాండ్‌పై అద్భుతంగా బౌలింగ్ చేశాడని.. ఐదు వికెట్లు కూడా తీశాడని తెలిపాడు.

# నగల మేళా!

**ముత్యాల్లోనే కాదు, ఆ వన్నెలద్దుకున్న మదర్ ఆఫ్ పెరల్స్‌తోనూ ఎన్నో నగల డిజైన్లనీ తీసుకొచ్చారు... అన్ని ఆభరణాల్లాగే ఇప్పుడు గోల్డ్ వాచీల్నీ చేసిపెడుతున్నారు... ఆనాటి ఫ్యాషన్ తాళాలగుత్తికి బంగారు మెరుపులు అద్దుతున్నారు... కావాలంటే ఆ నయా జ్యువెలరీ మీద మీరూ ఓ లుక్కేయండి!**







### బంగారు తాళాల గుత్తి!

సొగసరి నడుముకు తాళాల గుత్తి తగిలించుకోవడం అన్నది ఒకప్పటి ఫ్యాషన్! మువ్వల అల్లికలతో చక్కటి డిజైన్లలో వెండి తాళాల గుత్తిని చేయించుకునేవాళ్లు. చీర కట్టినా, లంగాఓణీ వేసుకున్నా అతివల అలంకారాన్ని మరింత పెంచే ఈ జ్యువెలరీ ఇప్పుడు మళ్లీ వచ్చేసింది. ఈతరాన్నీ ఆకట్టుకుంటున్న ఈ తాళాల గుత్తి సరికొత్తగా ముస్తాబైంది. బంగారు చమక్కులూ, రత్నాల మెరుపులూ, ముత్యాల సొబగులతో అందంగా తయారైపోయింది. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అంటున్న కుర్రకారు రెట్రో ఫ్యాషన్లలో భాగంగా అమ్మమ్మల్ని అలరించిన అలనాటి నగలమీద మనసు పారేసుకుంటూ వీటికీ ఓటేస్తున్నారు. పెళ్లిళ్లూ పేరంటాల్లో చక్కని చీర కట్టి నడుముకు బంగారు తాళాల గుత్తి పెట్టి వయ్యారంగా నడిచే భామను చూస్తుంటే 'వయ్యారి భామా నీ హంస నడకా' అన్న పాట ఎవరికైనా మదిలోకి రాకుండా ఉంటుందా... మీరే చెప్పండి!

### గోల్డ్ వాచీలు నచ్చాయా!

ఒకప్పుడు వాచీ అంటే టైమ్ చూసుకోవడానికే, ఆ తర్వాత కొత్త కొత్త మోడల్స్‌తో అదో ఫ్యాషన్ అయిపోయింది. ఇప్పుడేమో బంగారు జ్యువెలరీలో భాగమై చెవి పోగులూ, ఉంగరాలూ, గొలుసుల సరసన చేరిపోయింది. మిగిలిన నగల్లాగే పెద్ద పెద్ద జ్యువెలరీ సంస్థలు వీటిని కూడా చేయించి ఇస్తున్నాయి. రత్నాలూ, ముత్యాలూ, బంగారు నగిషీలతో వస్తున్న ఈ గోల్డ్ వాచీల్లో బ్యాంగిల్ గడియారాలు సరికొత్తవి. ఒకే ఆభరణం రెండు విధాలుగా ఉంటే ఏ అమ్మాయికి మాత్రం నచ్చదూ... అందుకే కోరిన డిజైన్లలో ఈ బంగారు వాచీ గాజుల్ని తయారు చేయించుకుంటున్నారు. అందమైన డయల్‌తో మెరిసిపోయే ఈ గోల్డ్ వాచీలు ఇటు ట్రెండ్ ఫాలోవర్లనీ అటు ట్రెడిషనల్ లుక్కును ఇష్టపడేవారినీ కూడా ఆకట్టుకుంటున్నాయి! మరెందుకాలస్యం... వెంటనే వాచీ గాజునీ మీ నగల పెట్టెలోకి తెచ్చేయండి మరి!







### ఆల్చిప్పల అందాల నగలు!

ఎన్ని ఆభరణాలున్నా వెన్నెల కాంతులతో కనువిందు చేసే ముత్యాల హారాల అందమే అందం అంటూ మురిసిపోతుంది మగువ. అందుకే, ఆ ముత్యాల మేళవింపుతో చిన్న నగ అయినా చేయించుకుంటుంది. అది గమనించే ఈతరం అమ్మాయి అభిరుచికి తగ్గట్టు వీటిల్లో ఎన్నో డిజైన్లూ వస్తున్నాయి. అలా ఈసారి ఇంకాస్త వెరైటీగా మదర్ ఆఫ్ పెరల్ జ్యువెలరీ ట్రెండ్ మొదలైంది. ముత్యం పుట్టే ఆల్చిప్పల్లోని మెరుపులే ఈ మదర్ ఆఫ్ పెరల్స్. చందమామలా కాంతులీనే ముత్యాల్ని తీసుకుని ముత్యపు చిప్పల్లోని అందాల్ని వదిలేస్తే ఏం బాగుంటుంది అనుకున్నారేమో తయారీదారులు వాటితోనూ చూడచక్కని ఆభరణాల్ని తీర్చిదిద్దుతున్నారు. చెవిపోగులూ, గాజులూ, పెండెంట్లూ... ఇలా అన్ని రకాల నగల్లోనూ ఈ మదర్ ఆఫ్ పెరల్‌ని భాగం చేస్తున్నారు. విలక్షణమైన అందంతో మెరిసిపోయే ఈ జ్యువెలరీ కొత్తదనం కోరుకునే వారందరికీ ఎంతగానో నచ్చేస్తుంది!

# ద్రాక్ష... కండరాలకి రక్ష



**నలభైలు దాటాక శరీర దారుఢ్యం తగ్గుతుంది. సౌష్ఠవం సన్నగిల్లుతుంది. కండరాల పటుత్వం తగ్గడమే ఇందుకు కారణం. రోజువారీ వ్యాయామం చేయడం, ప్రొటీన్ ఆహారాన్ని తీసుకోవడం వంటివి కొంతవరకూ కండరాల తరుగుదలని నిలువరిస్తాయని చెబుతారు. ఆ రెండే కాకుండా ద్రాక్ష కూడా ఇందుకెంతో ఉపయోగపడుతుందని చెబుతోంది పరిశోధన. ద్రాక్షలు కండరాలకి నేరుగా శక్తినివ్వడమే కాకుండా... అందుకు కారణమైన జన్యువుల్లో చురుకుదనం పెంచుతున్నాయట. కప్పు ద్రాక్ష పండ్లను... రోజుకి రెండుసార్లు తీసుకోగలిగితే అవి ఓ వైపు - కండరాల రాశిని పెంచే జన్యువుకి సంబంధించిన వ్యక్తీకరణ(జీన్ ఎక్స్‌ప్రెషన్)ని వృద్ధి చేస్తున్నాయట. మరోవైపు - వయసుతో కండరాల పెరుగుదలని క్షీణింపచేసే ఇంకో జన్యువుని అడ్డుకుంటున్నాయట. ఈ విషయంలో మగవారిలోకన్నా మగువల్లో ద్రాక్షలు మంచి ఫలితాన్ని చూపుతున్నాయని చెబుతున్నారు ఈ పరిశోధన చేసిన అమెరికాలోని వెస్టర్న్ న్యూ ఇంగ్లండ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.**



# ఐఫాలో లాపతా లేడీస్ సంచలనం..



ఏకంగా పది అవార్డులు

టాకీస్: భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే 'ఐఫా' అవార్డ్స్ వేడుక రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా ముగిసింది. జైపూర్ ఎగ్జిబిష కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 8వ తేదీన అట్టహాసంగా ప్రారంభమైన ఈ వేడుక.. ఆదివారంతో ముగిసింది. మొదట డిజిటల్ అవార్డులను ప్రకటించిన నిర్వాహకులు.. ఆదివారం రాత్రి చలనచిత్ర అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో కిరణ్ రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' సంచలనం సృష్టించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి, ఉత్తమ కథ ఇలా ఏకంగా పది కేటగిరీల్లో అవార్డులు గెలుసుకుని సత్తా చాటింది. 'భూల్ భూలయ్యా 3'కు ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్ అవార్డు సొంతం చేసుకున్నారు. బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ ప్రొడక్షన్‌లో వచ్చిన చిత్రం 'లాపతా లేడీస్' . ఆయన మాజీ భార్య కిరణ్ రావ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించింది. జమ్తారా వెబ్‌సిరీస్ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ్ ఈ మూవీలో హీరోగా నటించగా.. భోజ్‌పురి నటుడు రవి కిషన్ కీలక పాత్రలో మెరిశాడు. ఈ సినిమా గతేడాది మార్చి 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రం ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నది. సుప్రీం కోర్టు ఆవిర్భవించి 75 ఏళ్లు అయిన సందర్భంగా.. కోర్టు అడ్మినిస్ట్రేట్ వేడుకల్లోనూ ఈ చిత్రం ప్రదర్శితమైంది. 2001లో సాగే కథ ఇది. పల్లెప్రాంతానికి చెందిన ఇద్దరు పెళ్లికూతుళ్లు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారు అవుతారు. ఆ తర్వాత ఎ లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అనేదే ఈ చిత్ర కథ. భారతీయ సమాజంలో కట్టుబాట్ల పేరుతో మహిళల స్వేచ్ఛను హరిస్తున్న తీరుని, వారి ఆకాంక్షలను అణచివేస్తున్న ధోరణిని సందేశాత్మకంగా ఈ చిత్రంలో ఆవిష్కరించారు.




# సినిమాలో అవకాశాలు తగ్గాయి

## యాడ్స్‌తోనే సంపాదిస్తున్నా : ప్రకాష్‌వారియర్



టాకీస్: నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమస్ అయ్యింది.తర్వాత సినీరంగంలోకి నటిగా ఎంట్రీ ఇచ్చింది. కథానాయికగా ఆమె నటించిన ఫస్ట్ మూవీ సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా అందులో ఆమె కనిపించిన సీన్స్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో దూసుకుపోయాయి. కట్ చేస్తే.. స్టార్ హీరోయిన్‌గా క్రేజ్ సొంతం చేసుకుంది. కానీ అం దం, అభినయం కట్టిపడేసిన ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో నెమ్మదిగా అవకాశాలు తగ్గిపోయాయి. కానీ సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆ బ్యూటీ మాట్లాడుతూ.. తనకు ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదని.. కానీ తాను మాత్రం సోషల్ మీడియా పేజీల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నానని తెలిపింది హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒకే ఒక్క సినిమాతో మలయాళీ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న నటి ప్రియా ప్రకాష్ వారియర్. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఒరు అదార్ లవ్ చిత్రంలోని ఒక పాటలో కన్నుగీటుతూ కనిపించి ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత నెట్టింట తెగ ట్రెండ్ అయ్యింది. అలాగే మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుంది. ఒక్క రోజులోనే లక్షలాది మంది ఆ నటిని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటనలు, ప్రమోషన్ ద్వారా దృష్టిని ఆకర్షించింది. దీనివల్ల స్టార్‌కు మంచి ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని ఆ స్టార్ స్వయంగా బహిరంగంగా చెప్పడంతో ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా లేకపోయినా బ్రాండ్ల నుండి ప్రకటనలు వస్తున్నందుకు ఉపశమనం కలిగిస్తోందని తెలిపింది. కానీ తన లక్ష్యం మాత్రం సినిమాల్లో నటించడమే అని తెలిపింది.

## 'కన్నప్ప' నుంచి... 'సగమై.. చెరిసగమై' అంటూ

# సాగే ప్రేమ పాట విడుదల

టాకీస్: డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'పై పాజిటివ్ బజ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. శివా శివా శంకర పాట, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రెండో టీజర్‌తో సినిమా మీద అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ మూవీని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో మరింతగా ప్రమోషనల్ కార్యక్రమాలను పెంచేశారు. ఈ సందర్భంగా ఓ బ్యూటీఫుల్ లవ్ మెలోడీ సాంగ్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు.

విష్ణు మంచు, ప్రీతి ముకుందన్ కనిపించే 'సగమై.. చెరిసగమై' అంటూ సాగే ఈ పాటను తాజాగా విడుదల చేశారు. ఈ పాటను రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. స్టీఫెన్ దేవస్సీ బాణీ హృదయాన్ని హత్తుకునేలా ఉంది. శ్రీమణి సాహిత్యం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సాంగ్ చిత్రీకరించిన తీరు, ఇక ప్రభు దేవా, బృందా కొరియోగ్రఫీ చేసిన విధానం, విష్ణు మంచు-ప్రీతి ముకుందన్‌ను చూపించిన తీరు, వారిద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది.

శివ భక్తుడైన కన్నప్ప పురాణ కథను వెండితెరపై ఆవిష్కరించబోతోన్నారు. విష్ణు మంచు కన్నప్పగా, అక్షయ్ కుమార్ శివుడిగా, ప్రభాస్ రుద్రుడిగా, కాజల్ పార్వతీ మాతగా ఈ చిత్రంలో కనిపించనున్నారు.



# పుష్ప-2 'పావని కరణం'.. చీరలో అందాల మెరుపులు

టాకీస్: 'పుష్ప 2' సినిమా విజయం సాధించడంతో అందులోని ప్రతి పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ గా నిలిచింది. ఇందులో 'కావేరి' పాత్రలో నటించిన పావని కరణం ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోటోషూట్‌లతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ఎప్పుడూ సింపుల్ లుక్‌లో కనిపించే పావని, తాజాగా స్టైలిష్ ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోతూ కుర్రాళ్ల గుండెల్లో దడ పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే పావని, తాజాగా గోల్డెన్ శారీలో దిగిన ఫోటోలను షేర్ చేసింది. ప్రాముఖ్యమైన అవార్డు షో కోసం స్టైలింగ్ అన్ని స్వయంగా చేసుకున్నానని తెలిపింది. ఆమె కర్లీ హెయిర్, మినిమల్ మేకప్, జ్యువెలరీతో ఓ రాయల్టీ ఫీల్‌ను తీసుకువచ్చింది. సింప్లిసిటీ లో ఉండే అందాన్ని మరోసారి నిరూపించిన ఈ లుక్స్, నెటిజన్లను మాయ చేస్తున్నాయి. న్యెట్ లైట్స్ లో ఆమె ఫోజ్ చేసిన ఫోటోలు హాట్ టాపిక్ గా మారాయి. పావని కరణం కెరీర్ విషయానికొస్తే, ఆమె 'పరేషాన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. "సమోసా తింటావా శిరీష?" అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిన్నా చితకా సినిమాల్లో నటించిన ఈ అమ్మడు, 'పుష్ప 2'లో కీలక పాత్ర పోషించడం ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయ్యింది. పుష్ప రాజ్ అన్నయ్య కూతురుగా 'కావేరి' పాత్రలో నటించి ప్రేక్షకుల మనసులు దోచుకుంది. ఆ సినిమాలో తన నటన ఎంత బలమైనదో ఇప్పుడు ఈ ఫోటోషూట్‌లోనూ తన గ్లామర్‌తో మరోసారి నిరూపిస్తోంది. సాధారణంగా నటీనటులు వెస్టన్ లుక్స్‌లో హాట్ ఫోటోషూట్‌లు చేస్తుంటారు. కానీ పావని ట్రెడిషనల్ లుక్‌లోనూ అందాన్ని చాటుకోవచ్చు అని ప్రూవ్ చేసింది. ఎప్పుడూ మోడరన్ లుక్‌లో కాకుండా, సింప్లిసిటీ లోనూ ఎంత అద్భుతంగా మెరిసిపోవచ్చో ఈ ఫోటోలు చెబుతున్నాయి. అంతే కాకుండా అవార్డును పట్టుకుని ఇచ్చిన పోజులు ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ లా నిలిచేలా ఉన్నాయి. త్వరలో పావని మరిన్ని వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటించే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది.

# రష్మికకు మద్దతుగా నిలిచిన కొడవ

టాకీస్: కొడవ హక్కుల పరిరక్షణ సంస్థ కొడవ నేషనల్ కౌన్సిల్ నటి రష్మిక మందన్న భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కొనసాగుతున్న రాజకీయ వివాదాల మధ్య ఆమెకు భద్రత కల్పించాలని కేంద్ర, కర్ణాటక హెూం మంత్రులను కోరింది. నటి రష్మిక మందన్న కర్ణాటకలోని కొడవ కమ్యూనిటీకి చెందినవారు. ఆమె బేస్ కొడగు ప్రాంతం. ఆమె కొడవ వారసత్వం కారణంగా నటిని అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గనిగ నటిపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ అభ్యర్థన చేసింది. రష్మిక కృషి, ప్రతిభతో గొప్ప పేరు తెచ్చుకుంది. కొందరు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఆమెను అనవసరమైన రాజకీయ చర్చల్లోకి లాగుతున్నారని అధ్యక్షుడు నందినేర్వండ నాచప్ప ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమె ఎదుగుదలకు.. రాజకీయాలతో సంబంధం లేదని.. ఆమెను రాజకీయ నా యకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కొందరు వ్యక్తులు, కళాత్మక స్వేచ్ఛ గురించి తెలియక, ఆమెను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలోని మాండ్య నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గనిగ.. రష్మిక కన్నడ చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేసి బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరు కావడానికి నిరాకరించారని ఆరోపిస్తున్నారు.



## ప్రేమ వ్యాపారంగా మారితే..

# విడిపోవడమే బెటర్ : తమన్నా



టాకీస్: పెళ్లి కాకముందే బెస్ట్ కపుల్స్ అనిపించుకున్నారు తమన్నా, విజయ్‌వర్మ. అయితే.. ఇప్పుడు హటాత్తుగా ఇద్దరూ విడిపోయారనే వార్తలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే.. ఈ విషయాన్ని వారు మాత్రం ధృవీకరించలేదు. అయితే.. ఇటీవలే ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ తమన్నా మాట్లాడిన మాటలు.. వారి బ్రేకప్‌కు బలాన్నిస్తున్నాయి. ప్రేమలో స్వేచ్ఛ ఉండాలి. కట్టడి ఉండకూడదు. ప్రేమలో ఎమోషన్స్ ఉ ఒడాలి. అంచనాలు ఉ ఒడకూడదు. అలా వుంటే అది ప్రేమకాదు. వ్యాపారం అవుతుంది. ఎప్పుడైతే ప్రేమ వ్యాపారంలా మారుతుందో.. అప్పుడు కలిసి ఉండటం కంటే విడిపోవడం బెటర్.' అంటూ స్పందించింది తమన్నా. ఆమె మాటలు విన్న వారంతా బ్రేకప్ విషయంపై ఓ అభిప్రాయానికి వచ్చేస్తున్నారు.

# కళ్లలో నీళ్లు తిరిగాయి: తమన్



టాకీస్: సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ తన సంగీతంతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాడు. సినిమా సినిమాకు అదిరిపోయే మ్యూజిక్ అందిస్తూ దూసుకుపోతున్నాడు. అలాగే పాన్ ఇండియా రేంజ్ లో హిట్స్ అందుకుంటున్నాడు తమన్. ఈ యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో యమా బిజీగా ఉన్నాడు. వైవిధ్యమైన మ్యూజిక్ అందిస్తూ.. కొత్త కొత్త సింగర్స్ ను పరిచయం చేస్తున్నారు తమన్. ప్రస్తుతం ఓజీ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు తమన్. ఇక సోషల్ మీడియాలోనూ తమన్ చాలా యాక్టివ్ గా ఉన్నాడు. రెగ్యులర్‌గా తన సినిమా అప్డేట్స్ ఇస్తూ అభిమానులకు కిక్ ఇస్తుంటారు తమన్. ఇదిలా ఉంటే తాజాగా తమన్ షేర్ చేసిన వీడియో ఇప్పుడు అందరిని ఎమోషనల్ అయ్యేలా చేస్తుంది. తమన్ షేర్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. "కళ్లల్లో నీళ్లు తిరిగాయి.. మనసంతా సంతోషంతో నిండిపోయింది.. ఇదే ఆనందమంటే" అంటూ ఓ ట్వీట్ చేశారు తమన్. అంతలా ఈ ట్వీట్ లో ఏముందంటే.. ఈ వీడియోలో ఓ పెద్దాయన హైవే పక్కన కూర్చొని జండా ఊపుతూ కనిపించాడు. ఓ హెూటల్ ముందు కూర్చొని జండా ఊపుతూ.. ఆ హెూటల్ కు వచ్చి భోజనం చేయండి అంటూ చెప్తున్నాడు. అంత మండుటెండలో కాళ్లకు చెప్పులు లేకుండా.. అంత కష్టపడుతున్న ఆ పెద్దయనను చూసి అటుగా కారులో వెళ్తున్న ఓ కుర్రాడు మానవత్వం చాటుకున్నాడు. ఇంత ఎండలో కాళ్లకు చెప్పులేకుండా.. కనీసం గొడుకు కూడా లేకుండా ఉన్నావ్ ఏంటి అని అడగ్గా..? ఏం చేయమంటావ్ బాబు..

హెూటల్ వాళ్లు గొడుగు కొంటాం అని అన్నారు.. చెప్పులు అయితే రాత్రి కుక్కలు కొరికేశాయ్ అని తెలిపాడు. దాంతో చలించిపోయిన ఆ కుర్రాడు.. ఓ గొడుగు, చెప్పులతో పాటు ఓ జ్యూస్ బాటిల్ కూడా కొనుకొచ్చి ఇచ్చాడు. ఆ కుర్రాడు చూపించిన దయకు చాలా కృతజ్ఞతలు బాబూ అంటూ ఆ కుర్రాడి చేతిని ముద్దాడాడు ఆ పెద్దాయన. ఈ వీడియోను తమన్ షేర్ చేశారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.